# 3784.99 కోట్లతో.. 39 ఎస్టీపీలు

## వంద శాతం మురుగునీటి శుద్ధి దిశగా కీలక అడుగులు

### కేసీఆర్ సర్కారు హయాంలోనే రూ. 3866.41 కోట్లతో 31 ఎస్టీపీలకు శ్రీకారం

### విడతలవారీగా అందుబాటులోకి.. తాజాగా అమృత్ పథకం కింద భారీ మురుగునీటి ప్రాజెక్టు

### ప్రభుత్వ పరిశీలనలో దస్త్రం, త్వరలో పరిపాలన అనుమతులు

సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ ) : దేశంలోనే వంద శాతం మురుగు శుద్ధి చేసే తొలి నగరంగా హైదరాబాద్‌ను నిలుపాలన్న గత కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యం పూర్తి స్థాయిలో నెరవేరనున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పురుడు పోసుకున్న ప్రతిపాదనల్లో మరో అద్భుతమైన భారీ మురుగునీటి ప్రాజెక్టు పట్టాలెక్కేందుకు సిద్ధమవుతున్నది. ఇప్పటికే రోజూ ఉత్పన్నమయ్యే మురుగునీటిని వంద శాతం శుద్ధి చేయడానికి వీలుగా రూ. 3866.41 కోట్ల వ్యయంతో 1259.50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో 31 కొత్త ఎస్టీపీలను చేపట్టి.. ఏడు చోట్ల వినియోగంలోకి తెచ్చారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దుర్గం చెరువు, కోకాపేట ఎస్టీపీలు అందుబాటులోకి రాగా, కాంగ్రెస్ సర్కారు మీరాలం, పెద్ద చెరువు, నల్లచెరువు ఎస్టీపీలను ప్రారంభించారు. ఈ క్రమంలోనే మియాపూర్ పటేల్ చెరువు, సఫిల్‌గూడ, ఖాజాగూడ, ఫత్తేనగర్, వెన్నెలగడ్డ, నాగోల్ ఎస్టీపీ పనులు పూర్తి చేసుకొని, ట్రయల్ రన్ జరుగుతుండగా, త్వరలోనే వీటిని ప్రారంభించనున్నారు. పురోగతిలో ఉన్న ఎస్టీపీలను విడతలవారీగా తీసుకొచ్చి.. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరులోగా ఈ ప్రాజెక్టు పూర్తి ఫలాలు అందుబాటులోకి తెచ్చేలా జలమండలి చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే మూసీ నది ప్రక్షాళనలో భాగంగా రూ.3784 కోట్ల అంచనా వ్యయంతో 965 ఎంఎల్‌డీల సామర్థ్యంతో కొత్తగా మరో 39 ఎస్టీపీల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టబోతున్నది.

### 39 ఎస్టీపీల ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం..

గత ప్రభుత్వంలోని ప్రతిపాదనలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని మూసీ సుందరీకరణ ప్రాధాన్యతలో భాగంగా తాజా భారీ ప్రాజెక్టును పట్టాలెక్కించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్) పథకం కింద కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 39 ఎస్టీపీల ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. అమృత్ పథకంలో భాగంగా ప్రాజెక్టు మొత్తంలో 25 శాతం కేంద్రం, 35 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా, 40 శాతం సంబంధిత ఏజెన్సీ వాటా చొప్పున హెచ్ఏఎం మోడ్‌లో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్న ఈ ప్రాజెక్టుకు త్వరలోనే పరిపాలన అనుమతులు లభించనున్నాయని ఓ ఉన్నతాధికారి తెలిపారు. 39 ఎస్టీపీల్లో దాదాపు 20 చోట్ల భూ సేకరణ సమస్య లేదని, మిగిలిన చోట ఆయా జిల్లాల కలెక్టర్లతో సంప్రదింపులు జరుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టు పనులకు టెండర్లను ఆహ్వానించి పనులు చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**ప్యాకేజీ-1లో రూ. 493.50 ఎంఎల్‌డీ సామర్థ్యం/రూ.1878.55కోట్లు**

| ప్రాంతం | ఎస్టీపీ సామర్థ్యం ఎంఎల్‌డీ | ప్రాజెక్టు వ్యయం రూ.కోట్లలో) |
|---|---|---|
| అమీన్‌పూర్ | 28 | రూ.116.08కోట్లు |
| తెల్లాపూర్ (నేరేళ్ల) | 31 | రూ.120.61 |
| ఇక్రిశాట్ | 24.50 | రూ.101.79 |
| ఉక్షేబావి | 100 | రూ.328.56 |
| పోచారం | 12.50 | రూ.55.82 |
| తిమ్మక్క చెరువు | 98.50 | రూ.323.63 |
| గండిగూడెం | 22.50 | రూ.93.62 |
| గౌడవెల్లి | 1.50 | రూ.10.56 |
| పోతాయిపల్లి లేక్ | 7.50 | రూ.39.69 |
| నవకుంట లేక్ | 14.50 | రూ.64.87 |
| నల్లచెరువు-2 | 36.50 | రూ.140.90 |
| కాప్రా | 5.50 | రూ.28.90 |
| హైదరాబాద్ | | |
| పబ్లిక్ స్కూల్ | 36.50 | రూ.140.90 |
| ఫతేనగర్-2 | 20 | రూ.89.32 |
| చిత్రపురి కాలనీ | 20 | రూ.89.32 |
| నార్సింగి | 34.50 | రూ.133.98 |

**నూతన ఎస్టీపీలు ఇవే**

**ప్యాకేజీ-2లో రూ. 471.50 ఎంఎల్‌డీ సామర్థ్యం/రూ.1906.44కోట్లు**

| ప్రాంతం | ఎస్టీపీ సామర్థ్యం ఎంఎల్‌డీ | ప్రాజెక్టు వ్యయం రూ.కోట్లలో) |
|---|---|---|
| పిర్జాదీగూడ | 61 ఎంఎల్‌డీ | రూ.200.93కోట్లు) |
| కొర్రెముల | 34.50 | రూ.133.98 |
| నాగారం లేక్ | 47.50 | రూ.174.59 |
| చీర్యాల లేక్ | 6.50 | రూ.34.59 |
| కుందన్‌పల్లి | 9 | రూ.47.63 |
| యానాంపేట | 26 | రూ.107.91 |
| కుంట్లూరు | 31.50 | రూ.122.60 |
| గౌరెల్లి | 7 | రూ.36.85 |
| ఎదుల చెరువు | 23.50 | రూ.97.71 |
| పల్లె చెరువు | 13.50 | రూ.58.89 |
| ఉమ్దా సాగర్ | 23.50 | రూ.97.71 |
| బండ్లగూడ | 5.50 | రూ.28.91 |
| గుర్రం చెరువు | 19.50 | రూ.87.21 |
| మీర్‌పేట తలాబ్ ఎస్టీపీ | 18 | 78.95 |
| చందన చెరువు | 20 | రూ.89.32 |
| రావిర్యాల | 12 | రూ.53.71 |
| బొంగుళూరు | 5.50 | రూ.28.90 |
| మాసబ్ చెరువు | 36.50 | రూ.140.90 |
| కొత్వాల్‌గూడ | 1 | రూ.6.84 |
| లేక్ కాముని | 2.50 | రూ. 16.80 |
| హైదర్షాకోట్ | 36.50 | రూ.140.90 |
| బాపూఘాట్ (సంఘం) | 31 | రూ.120.61కోట్లు |

వార్షికోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు

సాంకేతిక అంశాలు

## పర్యావరణ హితానికి దోహదపడాలి

### రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి

మొయినాబాద్, జూన్ 16 : సాంకేతిక అంశాలు పర్యావరణ హితానికి దోహదపడాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లింబాద్రి మాట్లాడుతూ.. సాంకేతిక రంగం పర్యావరణానికి నష్టం కలుగకుండా ఉండేలా అభివృద్ధి జరగాలన్నారు. విద్యార్థులు తమ ఆలోచనలను కూడా పర్యావరణానికి నష్టం కలిగించకుండా మలుచుకోవాలని సూచించారు. సాంకేతిక నైపుణ్యమున్న విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. కేజీరెడ్డి కళాశాల విద్యార్థులు మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువులను కొనసాగించడం సంతోషకరమని ఆయన కితాబిచ్చారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రోహిత్, ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణ, అధ్యాపకులున్నారు.

నేషనల్ యూత్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో

## సాయికిరణ్ ప్రతిభ

షాట్‌పుట్ విభాగంలో బంగారు పతకం



బంగారు పతకంతో సాయికిరణ్

కొడంగల్, జూన్ 16 : నేషనల్ యూత్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో జాతీయస్థాయి షాట్‌పుట్ విభాగంలో కొడంగల్ మండలం హస్నాబాద్ యువకుడు బంగారు పతకం సాధించాడు. ఈ పోటీలను ఛత్తీస్‌గఢ్ ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో గత నెల ఆరు నెలలుగా కోచ్ నరహరి రమేశ్ ద్వారా శిక్షణ పొందిన సాయికిరణ్ తెలంగాణ తరఫున ఈ పోటీల్లో పాల్గొన్నాడు. దేశంలోని 29 రాష్ట్రాలకు చెందిన షాట్‌పుట్ క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఈ నెల 15న నిర్వహించిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో టాప్‌లో ఉన్న 12 మందిని ఫైనల్ రౌండ్‌కు ఎంపిక చేశారు. ఆది వారం నిర్వహించిన ఫైనల్ రౌండ్‌లో 5 కిలోల షాట్‌పుట్ విభాగంలో 18 మీటర్ల 36 సెంటీమీటర్ల దూరం విసిరి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ విజయంతో తెలంగాణకు మొదటి బహుమతి లభించింది. ఈ సందర్భంగా గోల్డ్ మెడల్ సాధించిన సాయికిరణ్ మాట్లాడుతూ.. తెలంగాణకు మొదటిస్థానం లభించడం ఆనందంగా ఉందన్నాడు.

## సీసీఎస్‌లో అవినీతి కంపు..!

- ప్రక్షాళన మొదలుపెట్టిన సిటీ కోత్వాల్
- వరుస ఏసీబీ దాడులతో అలర్ట్
- మల్టీజోన్ -2 కు 12 సీఐల సరెండర్

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ): ఆర్థిక నేరాలు జరిగితే హైదరాబాద్ సీసీఎస్‌కు వెళ్లే తమకు పక్కాగా న్యాయం జరుగుతుందనే భావన గతంలో ఉండేది. నేడు అలాంటి పరిస్థితి కనిపించడంలేదు. అవినీతి, అక్రమాలు సీసీఎస్‌లో రాజ్యమేలుతున్నాయి. ఫిర్యాదుదారులు, నిందితులు ఎవరైనా సరే.. అక్కడ లంచం ఇచ్చుకోవాల్సిందేనన్న ఆరోపణలు ఇప్పుడు బలంగా వినిస్తున్నాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు గుండెకాయ వంటి సెంట్రల్ క్రైమ్ పోలీస్‌స్టేషన్(సీసీఎస్)పై ఏసీబీ దాడులు వరుసగా జరగడంతో నగర పోలీస్ ఉన్నతాధికారులు కూడా అప్రమత్తమయ్యారు. సీసీఎస్ ప్రక్షాళన మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే నగర పోలీస్ కమిషనర్ 12 మంది సీఐలను మల్టీజోన్-2కు సరెండర్ చేశారు. అలా ఎన్నికల కోడ్ నేపథ్యంలో పలువురు జిల్లాల నుంచి నగరానికి బదిలీ అయ్యారు. కాగా, ఇటీవల టీమ్-7 ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఒక కేసును క్లోజ్ చేసేందుకు రూ.15 లక్షలు బాధితుల వద్ద డిమాండ్ చేశాడు. అడ్వాన్స్‌గా రూ.5 లక్షలు తీసుకొని, మిగతా డబ్బుల కోసం బాధితుడిపై ఒత్తిడి తెచ్చాడు. ఈ నేపథ్యంలోనే బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో రూ.3 లక్షల లంచం డబ్బులు తీసుకుంటూ.. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. ఈ లంచం డబ్బులలో ఎవరెవరికి వాటాలున్నాయనే విషయంలో మాత్రం ఇప్పటివరకు స్పష్టత రాలేదు. ఇలా అవినీతి మరకను అంటుకొని సీసీఎస్ అంతా అవినీతి కంపు కొడుతున్నది. దీనిని కడిగేసేందుకు ఇప్పుడు ఉన్నతాధికారులు నడుంబిగించారు. సీసీఎస్‌లో నమోదయ్యే చాలా కేసుల్లో 41 సీఆర్‌పీసీ నోటీసులు నిందితులకు ఇస్తుంటారు. అయితే ఇక్కడే కేసులు దర్యాప్తు జరిపే ఏసీపీలు, సీఐలు భారీగా వసూళ్లకు పాల్పడుతుంటారు. నోటీసులు ఇవ్వాలంటే కొందరు లక్ష రూపాయల నుంచి రూ.5 లక్షలకుపైగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

## అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్టు

### 164 కిలోల గంజాయి స్వాధీనం

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను సౌత్- వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుంచి 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మీపెరుమాళ్ ఆదివారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో వెల్లడించారు. కామారెడ్డి జిల్లాకు చెందిన దరావత్ రవి రైతు. మహారాష్ట్రలో అతడిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదైంది. ఇటీవల ఒడిశాలోని ముంచంపుట్ వెళ్లాడు. అక్కడ గంజాయి పండించే గోవింద్ అనే రైతును సంప్రదించి, అతడి వద్ద 100 కిలోల గంజాయి కొనుగోలుచేసి, 32 ప్యాకెట్లలో ప్యాక్ చేయించాడు. స్నేహితులైన మహారాష్ట్రకు చెందిన సయ్యద్ బహదూర్, ఆనంద రాంజీక దమ్ సహకారంతో కారులో లోడ్ చేసి హైదరాబాద్‌కు బయలు దేరారు. విశ్వసనీయ సమాచారంతో హైదరాబాద్‌లోని పారామౌంట్ కాలనీలో ఈ కారును ఆపి పోలీసులు తనిఖీ చేశారు. కారులో గంజాయి పట్టుబడటంతో ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు తదుపరి విచారణను హుమాయున్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

### ఇద్దరు పాత నేరస్తులు..

ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ డ్రగ్స్ స్మగ్లింగ్ కేసుల్లో హైదరాబాద్, రాజమండ్రి జైలుకు వెళ్లివచ్చాడు. ఈ క్రమంలోనే రాజమండ్రి జైల్లో ఏపీ రావులపాలెం నివాసి, గంజాయి పండించే స్మగ్లర్ దీపక్ పరిచయమయ్యాడు. జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత పర్వేజ్, ఏపీలో ఉన్న దీపక్‌ను సంప్రదించి, ఆర్టీసీ బస్సుల్లో గంజాయి రవాణా చేస్తున్నారు. అతడి స్నేహితుడైన అబ్దుల్ రవూఫ్‌తో కలిసి ఏపీ నుంచి గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్నారు. గంజాయి వెళ్లే వాహనానికి ఒక కారు, ద్విచక్రవాహనం పైలెట్‌గా వెళ్తుంది. ఈ క్రమంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో షేక్ పర్విజ్, అబ్దుల్‌రవూఫ్‌ను భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి 64 కిలోల గంజాయి, రెండు కార్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకొని, తదుపరి విచారణ నిమిత్తం భవానీనగర్ పోలీసులకు అప్పగించారు.

### గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు

అబిడ్స్ : అక్రమంగా గంజాయి నిల్వ చేసి విక్రయిస్తున్న ఇంటిని జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేశారు. ఆ ఇంట్లో నుంచి 8.26 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీసుల కథనం ప్రకారం.. లోయర్ ధూల్‌పేట్ శివలాల్‌నగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో అక్రమంగా గంజాయి నిల్వ ఉంచి, విక్రయిస్తున్నట్టు అందిన సమాచారంతో హైదరాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శిరీష నేతృత్వంలో ఎక్సైజ్ పోలీసులు ఆ నివాసంలో తనిఖీలు చేపట్టారు. అక్కడ పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనంలో 8.26 కిలోల గంజాయిని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. దుర్గేశ్‌సింగ్, అతడి తల్లి అనురాధపై కేసులు నమోదు చేశారు. అనురాధను అదుపులోకి తీసుకోగా, దుర్గేశ్ సింగ్ పరారీలో ఉన్నాడు. తదుపరి దర్యాప్తు నిమిత్తం కేసును ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ కేసును ధూల్‌పేట్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు మధుబాబు, గోపాల్ దర్యాప్తు చేస్తున్నారు.

## సిటీలో బెల్ట్ షాప్‌లపై టాస్క్‌ఫోర్స్ దాడి

### ఏడుగురి అరెస్ట్.. 96 లీటర్ల మద్యం స్వాధీనం

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లో బెల్ట్ షాప్‌లపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి ఏడుగుర్ని అరెస్ట్ చేశారు. 242 బాటిళ్లలో ఉన్న 96.5 లీటర్ల మద్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. కుల్సుంపురా, ఛత్రినాక, ముషీరాబాద్, కాచిగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని దుకాణాలపై దాడులు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిపెరుమాళ్ కథనం ప్రకారం.. కార్వాన్‌కు చెందిన వినీత్ సింగ్, అలియాబాద్, పూల్‌బాగ్‌కు చెందిన కురది సచిన్, దుర్గం చంద్రశేఖర్, ఎ.రవికుమార్, వారాసిగూడకు చెందిన రత్నాల రాజారావు తదితరులను అరెస్ట్ చేశారు. లైసెన్స్ మద్యం దుకాణాల నుంచి మద్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు వాటిని విక్రయిస్తూ అక్రమ పద్ధతిలో డబ్బు సంపాదిస్తున్నారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు బెల్ట్ షాప్‌లపై దాడులు నిర్వహించారు. నిందితులపై ఎక్సైజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

## ప్రశాంతంగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

### - పరీక్షకు హాజరైన 45,153 మంది అభ్యర్థులు

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ జిల్లాలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మెహిదీపట్నం సంతోషినగర్ కాలనీలోని సెయింట్ ఆన్స్ మహిళా పీజీ కళాశాలలో ఆదివారం జరిగిన పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పరీక్ష కోసం చేసిన ఏర్పాట్లను, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ.. పరీక్ష పారదర్శకంగా జరిగేందుకు సీసీ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 వరకు జరిగిన పేపర్-1 పరీక్షకు 25,875 మంది హాజరు కాగా, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు జరిగిన పేపర్-2 పరీక్షకు 25,661 మంది హాజరయ్యారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారిలో 19,492 మంది గైర్హాజరయ్యారని, కేవలం 56-57 శాతం మంది అభ్యర్థులు మాత్రమే పరీక్ష రాశారని తెలిపారు. జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా మాసబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన పర్యవేక్షించారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

గంజాయి ముఠాను పట్టుకున్న నాంపల్లి రైల్వే పోలీసులు

తెలుగు యూనివర్సిటీ, జూన్ 16: రైలులో గంజాయి తరలిస్తున్న ఓ ముఠాను నాంపల్లి రైల్వే పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఆర్పీఎఫ్ సీఐ జె. ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. విశాఖపట్నం నుంచి నగరం మీదుగా మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కర్రి రమణమ్మ(50), అర్లి గోవింద్(38)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా 26.684 కేజీల గంజాయి బయటపడింది. పట్టుబడిన గంజాయి విలువ రూ.6.50 లక్షలు ఉంటుంది. నిందితులను అరెస్టు చేసి, గంజాయి సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో సిబ్బంది మురళి, కోటేశ్వరరావు, అశోక్, దుర్గారావు, వి.రంగరావు తదితరులు పాల్గొన్నారు.

## కర్ర పూజ మేమే చేస్తాం.. కాదు మేమే చేస్తాం...

- నేడు ఖైరతాబాద్ గణేశుడి కర్ర పూజ
- ఉత్సవ కమిటీలో విభేదాలు...
- వేర్వురుగా ప్రకటించుకున్న కమిటీలు

ఖైరతాబాద్, జూన్ 16: ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన ఖైరతాబాద్ మహా గణేశుడికి అంకురార్పణ (కర్ర పూజ) క్రతువు నేటి (సోమవారం) సాయంత్రం ఐదు గంటలకు గణపతి ప్రాంగణంలో నిర్వహించనున్నారు. అయితే, ఈ ఏడాది ఎవరు చేస్తారన్న విషయంలో సందిగ్ధం నెలకొన్నది. గణేశుడి కర్ర పూజ తామే నిర్వహిస్తామని నూతనంగా ఏర్పడిన ఖైరతాబాద్ శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం పాత కార్యవర్గమైన ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ తామే నిర్వహిస్తామని ప్రకటించడం సభ్యుల మధ్య ఉన్న విభేదాలు వెలుగు చూశాయి. గత 70 ఏండ్లుగా ఉత్సవ కమిటీ వ్యవస్థాపకుడు దివంగత సింగరి శంకరయ్య కుటుంబ సభ్యులు స్థానిక బస్తీవాసులతో కలిసి నవరాత్రోత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నారు.

### కొండంత దేవుడికి కోటి విరాళాలు

ఖైరతాబాద్ గణేశుడిని దర్శించుకునేందుకు దేశ, విదేశాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివస్తారు. నవరాత్రులు పూర్తయ్యే సరికి సుమారు 40 నుంచి 50 లక్షల మంది స్వామి వారిని దర్శించుకుంటారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భక్తులు భారీ సంఖ్యలో కోట్లాది రూపాయల విరాళాలు, మొక్కుబడులు చెల్లించుకుంటారు. దేశ, విదేశాల నుంచి స్వామివారికి మొక్కులు సమర్పిస్తారు. ఈ నేపథ్యంలో స్వామివారి సేవల కోసం కమిటీలోని సభ్యుల మధ్య పోటీ పెరిగి విభేదాలకు దారి తీసి ఉండవచ్చని స్థానిక బస్తీవాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో నియోజకవర్గంలోప్రాతినిధ్యం వహిస్తున్న ఓ ప్రజా ప్రతినిధి కూడా చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదేమైనప్పటికీ నేడు జరిగే వేడుకలో ఒక్క కర్రనా లేక రెండింటిని ప్రతిష్ఠిస్తారో వేచిచూడాలి.

## మంత్రి చెబితేనే చేశా..

- కూల్చివేతలపై జోనల్ కమిషనర్ వివరణ
- బల్దియా కమిషనర్ ఆగ్రహం..
- జీఐడీకి రిపోర్టు చేయాలంటూ ఉత్తర్వులు

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ ) : ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నివాసం వద్ద కూల్చివేత ఘటనలో కీలక పరిణామం జరిగింది. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఏసీపీ సంపత్ ఆధ్వర్యంలో శనివారం జగన్ నివాసం బయట ఫుట్‌పాత్‌పై నిర్మించిన సెక్యూరిటీ గదులను కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఈ కూల్చివేతలపై తెలుగు రాష్ట్రాల్లో విస్తృత చర్చకు దారి తీసింది.

ఇటీవల ఎన్నికల్లో జగన్ ఓటమిపాలవడంతో భద్రతను తొలగించడం, గురు దక్షిణగా ఇక్కడి సీఎం రేవంత్‌రెడ్డి జగన్ ఇంటి వద్ద కూల్చివేతలు జరిపించారని సోషల్ మీడియా వేదికగా చర్చ జరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా కూల్చివేతలు జరిపిన ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఐఏఎస్ అధికారి హేమంత్ బోర్కడేపై జీహెచ్ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి సీరియస్ అయ్యారు. ఉన్నతాధికారులకు సమాచారం లేకుండా కూల్చివేత చేయడంపై ఆయనపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ మంత్రి ఆదేశాలతోనే కూల్చివేతలు జరిపానని సదరు జోనల్ కమిషనర్ వివరణ ఇచ్చారు. అయినా కమిషనర్ ఆమ్రపాలి జోనల్ కమిషనర్ హేమంత్‌ను బాధ్యతల నుంచి తొలగించి.. జీఐడీకి రిపోర్టు చేయాలని ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

### పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా..

## 5కే రన్

### ప్రతి ఒక్కరూ మొక్కల్ని పెంచాలి : ఉమర్ అలీషా

బేగంపేట్, జూన్ 16 : కోరలు చాచిన కాలుష్య కారకం నుంచి పర్యావరణాన్ని రక్షించడమే లక్ష్యంగా ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో ఆదివారం అవగాహన పరుగు నిర్వహించింది. సంజీవయ్య పార్కు నుంచి జలవిహార్ వరకు చేపట్టిన ఈ 5కే రన్‌ను ట్రస్ట్ చైర్మన్ శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి ఉమర్ అలీషా జెండా ఊపి ప్రారంభించారు. పర్యావరణం పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా వన సంపదను పెంచడమే ప్రధాన ధ్యేయంగా మహోత్తరమైన కార్యక్రమాన్ని చేపట్టినట్టు వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మొక్కల్ని పెంచితే ప్రకృతి పరవశించి పోతుందని అభిప్రాయపడ్డారు. అలాగే, ప్రజలంతా నీటి సంరక్షణకు పాటుపడాలని, ప్రకృతి ప్రసాదించిన వర్షపు నీటిని ఒడిసిపట్టి నీటిని కాపాడుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా కాలుష్యం సమస్త జీవకోటిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నీటిలో, భూమిలో కలవకుండా చూడాలని చెప్పారు. ప్రజలకు ఇలా అవగాహన కల్పించేందుకు ట్రస్ట్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు.

## గంజాయి చాక్లెట్ల విక్రేత అరెస్ట్

గంజాయి చాక్లెట్ల విక్రేతను అరెస్ట్ చేసిన శేరిలింగంపల్లి ఎక్సైజ్ శాఖ పోలీసులు

మాదాపూర్, జూన్ 16: గంజాయి చాక్లెట్ల విక్రేతను ఆదివారం శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ కథనం ప్రకారం.. శేరిలింగంపల్లిలోని నెహ్రూనగర్‌కు చెందిన బియాస్ గుప్తా (46) ఉత్తరప్రదేశ్ నుంచి గంజాయి చాక్లెట్లను కొనుగోలు చేసి, వాటిని తెలిసిన వారికి విక్రయిస్తున్